క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు లోకేష్ తెలిపారు. బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి 2.30 గంటల వరకు ఈ శిబిరంలో క్యాన్సర్, గుండె, ఎముకలు, కీళ్లు, గ్యాస్ట్రిక్ జబ్బులకు ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి కృషి

బంగారుపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్ష పదవి చేపట్టిన సందర్భంగా బుధవారం మహాసముద్రం గ్రామంలో ఆయన స్వగృహంలో పలువురు కార్యకర్తలు, గ్రామస్తులు కలసి అభినందించారు.

102 సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 102 సేవలను వినియోగించుకోవాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌సీ అనిల్‌కుమార్ నాయక్ కోరారు. సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 102 వాహన సేవలు ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ వాహనం ద్వారా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి గర్భవతులకు, రక్తహీనత గల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధీరజ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే ఎంఎస్ బాబుతో ధీరజ్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ధీరజ్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మర్యాద పూర్వకంగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్.బాబు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు.

కె.గొల్లపల్లె పాఠశాల విద్యార్థికి గోల్డ్ మెడల్



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: జిల్లా స్థాయి రెజిలింగ్ పోటీల్లో మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం లలిత తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించగా, గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షతేజ్ విశేష ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించారు. అతనిని బుధవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

ఐరాల: మండలంలోని మామిడి రైతులకు వైఎస్ గేటు సమీపంలో ఉన్న కలెక్షన్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్తల నేతృత్వంలో మామిడి కోతల అనంతరం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌ఐ సేవలు మరువలేనివి



ఎస్‌ఐని సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

గుడిపాల: శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి అన్నారు. గుడిపాల ఎస్‌ఐ రాజశేఖర్ అలిపిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి మండలంలో సమర్థవంతంగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. సీఐ రవిశంకర్‌రెడ్డి, యాదమరి, కాణిపాకం, తవణంపల్లె ఎస్‌ఐలు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

గజ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బాధితులు, అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

- ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు పరిహారం
- అన్నిరకాలు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భరోసా

గుడిపాల/చిత్తూరు రూరల్: ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన 190రామాపురానికి చెందిన భార్యాభర్తలు వెంకటేష్, సెల్వి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం నుంచి వారి కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఏనుగు దాడిలో గాయపడిన కార్తీక్‌కు మెరుగైన వైద్యం అందజేస్తామని, ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత తొందరలో ఒంటరి ఏనుగును బంధించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇది పలుచోట్ల విధ్వంసం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు.

బిక్కుబిక్కుమంటూ..

గజ సంచారంతో మండలంలోని ప్రజలు బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ అనారోగ్యం కారణాలతో రెండు రోజులుగా సెలవులో ఉన్నప్పటికీ ఏనుగు దాడి సమాచారమందుకుని హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏనుగు సంచారాన్ని తెలుసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా రైతులు పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. అనంతరం తీవ్ర అలసటకు గురైన ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. సిబ్బంది వెంటనే తహసీల్దార్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఏనుగు దాడి చేస్తుండగా చూశాం



మా ఊరి సమీపంలోని పంటపొలంలో జరిగిన ఏనుగుల దాడిని చూశాం. రామాపురానికి చెందిన సుబ్రమణ్యం భార్య సెల్వి అరుపులు విని ఇంటి బయటకు వచ్చాం. ఇంతలోనే సుబ్రమణ్యంపై ఏనుగు దాడి చేసి భీకర శబ్దంతో వెనుదిరిగింది. కొన ఊపిరితో కొట్టుకుంటున్న సుబ్రమణ్యంకు పరుగెత్తికెళ్లి నీళ్లు తాగించాం. రెండు నిమిషాల వ్యవధిలో చనిపోయాడు. తర్వాత ఏనుగు ఘీంకారాలు విని వచ్చేశాం. భార్య ఏనుగు చూసి అటువైపుగా వెళ్లిపోయిందని అనుకున్నాం. తీరా ఆమె కూడా అక్కడే చనిపోయి పడి ఉంది. ఇక్కడ ఉండాలంటే మాకు భయం ఉంది. అధికారులెవరైనా రక్షణగా ఉంటే మంచిది.

– సుబ్బమ్మ, లక్ష్మీపురం, గుడిపాల

కుంభాభిషేకానికి రూ.30వేలు విరాళం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో నిర్వహించనున్న కుంభాభిషేక మహోత్సవానికి దాత పార్థసారథి నాయుడు బుధవారం రూ.30 వేలు విరాళంగా అందజేశారు. ఆ నగదును ఆలయ నిర్వాహకులు కుట్టిరాయల్, మురళి, రాధాకృష్ణకు అందించారు. అంతకుముందు ఆలయంలో గోపూజ, హోమాది పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రారెడ్డి, ఆలయ ఈఓ వెంకటేశులు తెలిపారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం చెంగాల్రాయ కొండపై వెలసిన శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో బుధవారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారిని నగర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నిరంతరంగా ఓటర్ల నమోదు



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జేసీ వరుస సమావేశాలు నిర్వహించారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభానికి ముందు వరకు ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నమోదు, రీ వెరిఫికేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోందన్నారు. ఏ స్థాయిలో అభ్యంతరాలు ఉన్నా తిరిగి విచారణ చేయిస్తున్నట్లు చెప్పారు. 2024 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి ఉదయ్‌కుమార్, బీజేపీ నుంచి చిట్టిబాబు, కాంగ్రెస్ నుంచి పరదేశి, సీపీఐ నుంచి నాగరాజన్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించండి

బీఎల్‌వోలు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం నగరంలోని ప్రశాంత్ నగర్‌లో ఓటర్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాను పరిశీలించినట్లు చెప్పారు. బీఎల్‌వోలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈఆర్‌వోలు, స్పెషల్ ఆఫీసర్స్, ఏఈఆర్‌వోలు కసరత్తును పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరబాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, పలువురు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం

పూతలపట్టు: మండలంలో ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్వోలు వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయభాస్కర్ ఆదేశించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు.

136 గ్రామాల్లో మూడవ విడత రీ సర్వే

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 136 గ్రామాల్లో మూడవ విడత భూ రీ సర్వే నిర్వహించనున్నట్లు జేసీ శ్రీనివాసులు వెల్లడించారు. రీ సర్వే పురోగతిపై విజయవాడ నుంచి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ బుధవారం జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ అడిగిన ప్రశ్నలకు జేసీ సమాధానం ఇస్తూ మొదటి విడత 130 గ్రామాల్లో, రెండవ విడత 90 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయిందని, మూడో విడత రీ సర్వే జిల్లాలో 136 గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది తప్పిదాలకు పాల్పడకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే రాళ్ల నాటే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి విజయకుమార్

బంగారుపాళెం: ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలపై అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సీఆర్‌సీ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యాసామర్థ్యాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులకు సులభంగా విద్యాబోధన చేయాలని సూచించారు. శిక్షణ తరగతులను జిల్లా సెక్టోరియల్ అధికారి ఏఎల్ఎల్ కో–ఆర్డినేటర్ విజయకుమార్ సందర్శించారు. ఉపాధ్యాయులకు బోధనాంశాలపై పలుసూచనలు సలహాలు అందించారు. ఫార్మెటివ్ పరీక్షల గ్రేడింగ్ మార్కుల నమోదుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



గర్భిణితో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రియాంక

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా పేదల ఇంటి వద్దకే వైద్యం అందుతుందని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మండలంలోని వావిల్‌తోట పంచాయతీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూతిగానూరు గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి మాత్రలను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓనం పండుగ



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ శాస్త్రగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజామున దేవతమూర్తులకు అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

తెరపైకి టీడీపీ కొత్త డ్రామా



శైలజాచరణ్‌రెడ్డి

ఐరాల: సమాజసేవ ముసుగులో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సంజీవని మంత్రంతో తెరపైకి టీడీపీ కొత్త డ్రామాకు నిన్న కుప్పంలో నారా భువనేశ్వరి శ్రీకారం చుట్టారంటూ మహిళా, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోనల్ చైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆమె బుధవారం అగరంపల్లెలో మీడియాతో మాట్లాడుతూ, గతంలో హెరిటేజ్ వాహనాల ద్వారా ఎర్రచందనం స్మగ్లింగ్ చేసిన విషయాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆమె గుర్తు చేశారు. ఈ సంజీవని మాత్రం ఖచ్చితంగా టీడీపీ కోసమే పుట్టించిందని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు మాత్ర కాదని కాని ఆమె స్పష్టం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: పూతలపట్టు మండలంలో బుధవారం ఎస్‌ఈబీ అధికారులు కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. పోలవరం బస్టాప్ వద్ద బాలసుబ్రమణ్యం (44) అనే వ్యక్తి నుంచి 43 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయన్ను అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన కన్వీనర్లు



పూతలపట్టు: రాష్ట్ర విద్యుత్, అటవీశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి కలిశారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో బుధవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూతలపట్టు మండల అభివృద్ధికి తాను ప్రత్యేక చొరవ తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు కన్వీనర్లు తెలిపారు.

యాక్సిస్ బ్యాంకుకు ఫోరం అక్షింతలు

చిత్తూరు అర్బన్: ఖాతాదారుడి ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాక్సిస్ బ్యాంకుకు, జిల్లా వినియోగదారుల కమిషన్ (ఫోరం) మొట్టికాయ వేసింది. బాధితురాలు మీనాకు పరిహారం చెల్లించాలంటూ ఫోరం అధ్యక్షులు అనిత సభ్యులు కోమల, సలీం బుధవారం తీర్పునిచ్చారు. చిత్తూరు నగరం మురకంబట్టుకు చెందిన మీనా గాంధీ రోడ్డు లోని యాక్సిస్ బ్యాంకులో సేవింగ్స్ ఖాతా కలిగి ఉన్నారు. గతేడాది అక్టోబర్ 23వ తేదీన ఈమె ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.6 వేలు విత్ డ్రా చేయడానికి ప్రయత్నించారు. ఏటీఎం నుంచి నగదు రాకపోగా, ఖాతాలో ఉన్న నగదు విత్ డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీనిపై యాక్సిస్ బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఎలాంటి చర్య తీసుకోలేదు. లీగల్ నోటీసులు పంపినా కూడా బ్యాంకు అధికారులు స్పందించలేదు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ నిర్వహించిన ఫోరం యాక్సిస్ బ్యాంకు నిర్వహణను తప్పు పట్టింది. బాధితురాలికి రూ.6 వేలు నగదు తిరిగి చెల్లించడంతోపాటు, కోర్టు ఖర్చులకు రూ.2 వేలు పరిహారంగా, అదనంగా మరో రూ.2 వేలు, నాలుగు వారాల్లో చెల్లించాలని ఫోరం తీర్పునిచ్చింది.

జగనన్న కాలనీల్లో ఇంకుడుగుంతలు తప్పనిసరి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి

పూతలపట్టు: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా హౌసింగ్ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని పి.కొత్తకోట, తేనేపల్లి, పక్కాలగుట్ట కాలనీలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంకుడు గుంత కోసం ప్రత్యేకంగా రూ.6 వేలు అందిస్తోందని వెల్లడించారు. ఇంకుడుగుంతలను నిర్మించడం వల్ల ఇంట్లో వృథాగా పోయే నీటితో పాటు వర్షపు నీటిని కూడా ఆదా చేయవచ్చని తెలిపారు. భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పంచాయతీలలోని లేఅవుట్లకు సంబంధించిన వివరాలు కూడా తెలియడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరును మార్చుకోవాలని సూచించారు. లబ్ధిదారుల నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అందిస్తుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఎంపీడీఓ గౌరి, కిషోర్‌కుమార్, ఇన్‌చార్జి. ఏఈ శ్రీధర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న జిల్లా నోడల్ అధికారులు సుధాకర్, మోహన్‌సింగ్

ఐరాల: మండలంలోని ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా బైజ్యూస్ నోడల్ అధికారులు సుధాకర్, మోహన్ సింగ్ సూచించారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఐరాల, తవణంపల్లె, పూతలపట్టు మండలాల తెలుగు ఉపాధ్యాయులకు బైజ్యూస్ ట్యాబ్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మరమ్మతులకు గురైన ట్యాబ్‌లను తెప్పించి సాంకేతిక పరిజ్ఞానంతో ట్యాబ్‌లు పనిచేసే విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు మండలాల హెచ్‌ఎంలు పనిచేయని ట్యాబ్‌లను ఈ రోజు సాయంత్రం లోపు యాక్టివేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, సీఆర్పీలు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై దాడులు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రెండో రోజు స్కానింగ్ సెంటర్లపై దాడులను కొనసాగించారు. చిత్తూరు నగరంలోని బుధవారం పలు స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని డీఐఓ రవిరాజు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

పేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత



దొడ్డిపల్లెలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని మంగసముద్రం, చవటపల్లె, కోడిగుంట, కోకవాండ్లవూరు ప్రాంతాల్లో బుధవారం మేయర్ అముదతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లో సీసీరోడ్లు, కాలువలు, వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. గడపగడప పనుల కింద రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించి, చవటపల్లెలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ చల్లాముత్తు, కో–ఆప్షన్ మెంబర్ కోలాకిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

స్థానిక 2, 3 డివిజన్లు మురకంబట్టు, దొడ్డిపల్లెలో రూ.33 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముదతో కలిసి బుధవారం ప్రారంభించారు. మురకంబట్టు, దొడ్డిపల్లెలో సచివాలయాలకు ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు నవీన్, సునీత, శ్రీకాంత్, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకురాఖీ: కార్యక్రమంలో మేయర్ అముద, కార్పొరేటర్ హరిణిరెడ్డి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నివాసంలో కమిషనర్ అరుణ రాఖీ కట్టారు.







ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న కమిషనర్ అరుణ, కార్పొరేటర్ హరిణి రెడ్డి, మేయర్ అముద

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: రాష్ట్రంలో పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని అతికారపల్లె పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా బొమ్మన్‌చేను, అతికారపల్లె పాతపాళ్యం గ్రామాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలిసి ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని, వారందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నారన్నారు. దీన్ని గుర్తించి లబ్ధిదారులు సైతం రాబోవు ఎన్నికలలో జగనన్నను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మండలంలోని 12కమ్మపల్లె పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, శేఖర్, మురుగ, కబీర్, సురేష్, రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా రక్షాబంధన్

మండల కేంద్రంలోని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వెలుగు సంఘం మహిళలు రక్షాబంధన్ వేడుకలు వేడుకగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు మనోహర్ రెడ్డి హాజరుకాగా, వారికి మహిళలు రాఖీ కట్టి, ఆశీర్వాదాలు అందుకున్నారు. మహిళలకు వారు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీయం కల్పాలతా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.